అవిశ్వాసం నెగ్గేనా..

- పట్టుబట్టిన కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు
- కౌన్సిలర్లపై అనర్హత వేటుకు బీఆర్ఎస్ కసరత్తు
- 32 మందితో కలెక్టర్‌కు హస్తం పార్టీ వినతి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ

మహబూబ్‌నగర్ టౌన్, జనవరి 11 : మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పీఠాన్ని అధికార కాంగ్రెస్ చేజిక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తుండగా, బీఆర్ఎస్ అడ్డుకునేందుకు ప్రణాళికలు రచిస్తున్నది. పురపాలక చైర్మన్ పదవి కైవసం చేసుకునేందుకు కావాల్సిన మెజార్టీ కౌన్సిలర్లను తమ వైపు తిప్పుకోవడంలో కాంగ్రెస్ పార్టీ సఫలమైంది. బీఆర్ఎస్ పార్టీ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ల బృందం సంతకాలతో కూడిన పత్రాన్ని కలెక్టర్‌కు అందజేసిన విషయం తెలిసిందే. కలెక్టర్ త్వరలో నోటీసు లు జారీ చేసి అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు పురపాలికకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఈ మేరకు ఈనెల 27న మున్సిపాలిటీ సమావేశం నిర్వహించేందుకు అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది.

2019లో ఎగిరిన బీఆర్ఎస్ జెండా..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో 49 మంది కౌన్సిలర్ స్థానాలకు 2019లో బీఆర్ఎస్ పార్టీ పురపాలక పీఠాన్ని కైవసం చేసుకున్నది. పురపాలక చైర్మన్‌గా 2వ వార్డు నుంచి కౌన్సిలర్‌గా గెలుపొందిన కేసీ నర్సింహులు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ 30, కాంగ్రెస్ 5, బీజేపీ 5, ఎంఐఎం 3, స్వతంత్ర అభ్యర్థులు ఆరుగురు గెలుపొందారు. అనంతరం కాంగ్రెస్ నుంచి నలుగురు, బీజేపీ నుంచి ఇద్దరు, స్వతంత్రులు ఆరుగురు బీఆర్ఎస్‌లో చేరడంతో మున్సిపాలిటీలో బీఆర్ఎస్ బలం 42మంది కౌన్సిలర్ల వరకు చేరుకున్నది. ఎంఐఎం సభ్యులు సైతం బీఆర్ఎస్‌కే మద్దతుగా ఉన్నారు.

అవిశ్వాసానికి 32మంది మద్దతు..

మున్సిపల్ కౌన్సిలర్ ఆనంద్ కుమార్‌గౌడ్ నేతృత్వంలో పురపాలక పీఠం కైవసం చేసుకునేందుకు సీనియర్ నాయకులు ఎన్‌పీ వెంకటేశ్, సురేందర్‌రెడ్డి పావులు కదిపారు. జనవరి 6వ తేదీన కలెక్టర్‌కు 32 మంది కౌన్సిలర్ల సంతకాలతో కూడిన పత్రాన్ని సమర్పించి పురపాలక చైర్మన్‌పై అవిశ్వాసం ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ 20, కాంగ్రెస్ 5, బీజేపీ 3, ఎంఐఎం 4 మొత్తం 32మంది సభ్యులు కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టే అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా నిలిచారు.

కోర్టును ఆశ్రయించిన బీఆర్ఎస్..

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ బీ ఫారంపై విజయం సాధించిన నలుగురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారని, వారిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు జనవరి 8న హైకోర్టును ఆశ్రయించారు. ఈ నలుగురు కౌన్సిలర్లపై అనర్హత వేటు వేయాలని కోరారు. నలుగురు కౌన్సిలర్లను అనర్హులుగా తేల్చితే చైర్మన్ పదవిపై అవిశ్వాసం ప్రవేశపెట్టేందుకు ఆస్కారం ఉండదని బీఆర్ఎస్ ప్రయత్నిస్తున్నది.

కౌన్సిలర్లలో అలజడి..

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన పలువురిపై అనర్హత వేటు వేయాలని కోర్టును ఆశ్రయించడంతో కౌన్సిలర్లలో ఆందోళన నెలకొన్నది. ఒక వేళ కోర్టు తీర్పు వ్యతిరేకంగా వస్తే ఎలాగని మదనపడుతున్నారు. మరికొందరు అనవసరంగా కాంగ్రెస్ అవిశ్వాసానికి మద్దతుగా నిలిచామా అని భయాందోళనకు గురవుతున్నారు. కాగా, కాంగ్రెస్ పార్టీ వార్డు నాయకులు కొందరు బీఆర్ఎస్ కౌన్సిలర్లను పార్టీలోకి తీసుకోవద్దని పార్టీ కార్యాలయంలో నిరసన వ్యక్తం చేశారు. పదేండ్లు ప్రతిపక్షంలో ఉండి బీఆర్ఎస్‌పై పోరాడిన తమకు ఇప్పటికైనా న్యాయం జరుగుతుందని భావించామని, మళ్లీ బీఆర్ఎస్ నాయకులను పార్టీలో చేర్చుకుంటే తమ భవిష్యత్తు ఏమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

- మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్ అర్బన్, జనవరి 11 : నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తానని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం పట్టణంలోని మండల కార్యాలయంలో ఎంపీపీ వనజ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పార్టీలకు అతీతంగా పనిచేయాలని తెలిపారు. సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సమావేశంలో ఎంపీడీవో సద్గుణ, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

- ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

భూత్పూర్, జనవరి 11 : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని దేవరకద్ర ఎమ్మెల్యే మ ధుసూదన్‌రెడ్డి తెలిపారు. షాద్‌నగర్ లో మంగళవారం నిర్వహించిన జా తీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను స్థానిక కేజీబీవీ పాఠశాలలో ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మా ట్లాడుతూ ఆత్మరక్షణకు కరాటే ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో నాగయ్య, జీహెచ్ఎం ఆనంద మ్మ, ప్రత్యేకాధికారి ప్రశాంతి, కరాటే మాస్టర్ రహ్మతుల్లా పాల్గొన్నారు.

అడిగిన వారందరికీ పనికల్పించాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డి

పాలమూరు, జనవరి 11 : ఉపాధి హామీ పథకంలో అడిగిన వారందరికీ పనికల్పించాలని జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో గురువారం జెడ్పీ రెండో స్టాండింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద 2023-24లో 1.38లక్షల జాబ్‌కార్డులు ఇచ్చినప్పటికీ మరింత మందికి పని కల్పించాలని కోరారు. పండ్లతోటల పెంపకం, గిరివికాసం పథకం, మిషన్ భగీరథ, చేనేత, జౌళి, దేవదాయ, యువజన, క్రీడా శాఖల అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. 4వ స్థాయి స్టాండింగ్ కమిటీ సమావేశంలో విద్యాశాఖ గురించి సమీక్షించారు. జిల్లా పరిషత్ మూడో స్థాయి సంఘ సమావేశంలో వైస్ చైర్మన్ కొడ్గల్ యాదయ్య వ్యవసాయ అనుబంధ అంశాలపై సమీక్షించారు. 5వ స్థాయి సమావేశంలో జెడ్పీటీసీ వెంకటేశ్వరమ్మ అధ్యతన పింఛపై సమీక్ష నిర్వహించారు.

ఇండ్ల పట్టాలు ఇవ్వకుంటే.. ఆందోళన ఉధృతం చేస్తాం

తాసీల్దార్‌కు వినతిపత్రం ఆస్తున్న లబ్ధిదారులు

నవాబ్‌పేట, జనవరి 11 : ఇండ్ల పట్టా లు ఇవ్వకుండా ఆలస్యం చేస్తే.. ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని యన్మన్‌గండ్ల డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులు గురువారం తాసీల్దార్ మల్లికార్జునరావు ఎదుట తమ గోడును వెల్లబోసుకున్నారు. మండలంలోని యన్మన్‌గండ్లలో కేసీఆర్ ప్రభుత్వ పాలనలో నాటి మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రత్యేక చొరవతో 48 డబుల్‌బెడ్రూం ఇండ్లు నిర్మించారు. అప్పట్లో గ్రామ సభ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసినప్పటికీ.. ఎన్నికల కోడ్ రావడంతో వారికి సర్టిఫికెట్లు ఇవ్వలేదు. ప్రభుత్వం మారిన తర్వాత త్వరలోనే లబ్ధిదారులకు గృహ ప్రవేశాలు జరుగుతాయని ఆశించారు. కానీ అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో గతంలో గ్రామసభ ద్వారా ఎంపికైన లబ్ధిదారులు నాలుగు రోజుల కిందట డబుల్ బెడ్రూంల్లోకి ప్రవేశించారు. వారు డబుల్ బెడ్రూం ఇండ్లల్లోకి ప్రవేశించినప్పటి నుంచి అటు అధికారులు, ఇటు కొంత మంది నాయకులు వారిని ఇండ్లు ఖాళీ చేసి వెళ్లిపోవాలని వేధిస్తున్నారు. పోలీస్, రెవెన్యూ, హౌజింగ్ అధికారులు అక్కడికి వెళ్లి ఇండ్లు ఖాళీ చేయాలని లబ్ధిదారులపై ఒత్తిడి పెంచుతున్నారు. దీంతో చేసేది లేక డబుల్‌బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులు నవాబ్‌పేట రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి తమ గోడు వెళ్లబోసుకున్నారు. తాము నిరుపేదలమైనందుకే గతంలో తమను డబుల్‌బెడ్రూం ఇండ్లకు ఎంపిక చేశారని, ఇప్పుడు కుంటి సాకులతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. తమను ఇలాగే వేధిస్తే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తాసీల్దార్ మల్లికార్జునరావుకు వినతిపత్రం అందజేశారు. తాసీల్దార్ మల్లికార్జునరావు స్పందిస్తూ ఈ వినతిపత్రాన్ని ఉన్నతాధికారులకు అందజేస్తామని వివరించారు. కార్యక్రమంలో లబ్ధిదారులు నగేశ్, పరశురాములు, కేశవులు, నాగరాజు, నరేందర్, మహిళలు తదితరులు ఉన్నారు.

జాతీయస్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు ఎంపిక

మాగనూరు, జనవరి 11 : జాతీయస్థాయి షూటింగ్ పోటీలకు నేరెడుగం గ్రామానికి చెందిన జస్వంత్‌గౌడ్ ఎంపికైనట్లు షూటింగ్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గోపాలం గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల డిసెంబర్ 30, 31వ తేదీల్లో మహబూబాద్ జిల్లా తొర్రూరులో జరిగిన రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ క్రీడల్లో జస్వంత్‌గౌడ్ ప్రతిభచాటి సౌత్ జోన్ జాతీయస్థాయి జూనియర్ షూటింగ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 12 నుంచి 14వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలో జాతీయ స్థాయి పోటీలు ఉంటాయన్నారు.

'పది'లో మంచి ఫలితాలు సాధించాలి

జడ్చర్లటౌన్, జనవరి 11 : పదో తరగతి వార్షిక పరీక్షలకు పకడ్బందీగా ప్రిపరేషన్ చేసి మంచి ఫలితాలు సాధించాలని అదనపు కలెక్టర్ శైవేంద్రప్రతాప్ అన్నారు. జడ్చర్ల మండలంలోని పెద్దఆదిరాల జెడ్పీ హైస్కూల్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. 'మన ఊరు-మనబడి' కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను గురించి ఈఈ వైద్యం భాస్కర్, ఏఈ జేఎస్ఆర్‌కుమార్, నాగేందర్‌గౌడ్‌తో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం పదోతరగతి విద్యార్థులతో మాట్లాడి డిజిటల్ తరగతి విధానాన్ని పరిశీలించారు.

బహిరంగ ప్రకటన

తేది: 12-01-2024

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయడమేమనగా నా క్లయింటు శ్రీ వెలికెట్టి శ్రీనివాస్ తండ్రి వి. రాంచంద్రయ్య నివాసము ఇంటి నెం. 4-40, నెమిల గ్రామము, రాజాపేట్ మండలము, నల్గొండ జిల్లా గారి తరపున జారీ చేయు బహిరంగ ప్రకటన యేమనగా మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలము, మాచారం గ్రామ శివారులోని సర్వే నెం. 126/అ యందలి ప్లాట్ నెం. 42, విస్తీర్ణము 200-00 చదరపు గజములు గల ప్లాటుకు నా క్లయింటు యజమాని. పై కనబరచిన ప్లాకు సంబంధించిన లింకు డస్తావేజు నెం. 8678/2006, ఎస్.ఆర్.ఒ., జడ్చర్ల ప్రస్తుతము నా క్లయింటు ఆధీనములో లేదు. పై కనబరచిన లింకు డాక్యుమెంటుకు సంబంధించి ఎవరికైనా ఏలాంటి అభ్యంతరాలు, అధికారములు, హక్కులు, ఆక్షేపణలు ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన నాటి నుండి (5) రోజులలోపు తమ ఆక్షేపణలను క్రింద కనబరచిన చిరునామాకు తెలుపగలరని ఇట్టి బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయునైనది.

పై ప్లాటుకు హద్దులు:
తూర్పు: 25 ఫీట్ల వెడల్పు రోడ్డు, **పడమర:** ప్లాటు నెం. 48, **ఉత్తరం:** ప్లాటు నెం. 41, **దక్షిణము:** ప్లాటు నెం. 43.

గోపాల్ ఝువార్, అడ్వకేట్
జడ్చర్ల, సెల్: 9291211196

దివ్యాంగుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ : జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, జనవరి 11 : దివ్యాంగుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కలెక్టర్ రవినాయక్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యెన్నం మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం కోసం రెడ్‌క్రాస్‌తోపాటు సన్నిధి, శాంతివనంతోపాటు పలు ప్రైవేటు సంస్థలు పనిచేయడం అభినందనీయమన్నారు.

ఖాళీలను భర్తీ చేస్తాం : కలెక్టర్

జిల్లాలోని అన్ని శాఖల్లో దివ్యాంగుల ఖాళీలను భర్తీ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రవినాయక్ తెలిపారు. దివ్యాంగులకు అందించే ప్రత్యేక ప్రోత్సాహకాలన్నింటినీ ఎప్పటికప్పుడు అందిస్తామన్నారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన దవాఖానలో ప్రతి వారం సదరం శిబిరాలు నిర్వహించి సర్టిఫికెట్లు ఇస్తున్నామని తెలిపారు. అలింకో కంపెనీ ఆధ్వర్యంలో మూడు చక్రాల బ్యాటరీ సైకిళ్లను దివ్యాంగులకు పంపిణీ చేశారు. అంతకు ముందు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారి జ్యోతి, దివ్యాంగుల అసోసియేషన్ నాయకులు శ్రీనివాస్, ముంతాజ్, హరీశ్‌కుమార్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు, రెడ్‌క్రాస్ చైర్మన్ లయన్ నటరాజ్, బ్రహ్మమానసిక వికలాంగుల కరస్పాండెంట్ చంద్రశేఖర్ ఉన్నారు.

క్రీడలతో ఆరోగ్యం

మహబూబ్‌నగర్ టౌన్, జనవరి 11 : క్రీడలతో ఒత్తిడి తగ్గి ఆరోగ్యం చేకూరుతుందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గురువారం బాలుర కళాశాల మైదానంలో నిర్వహించిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. టోర్నీని నిర్వాహకులు రవీందర్‌రాజు, కిరణ్, వీరేశ్, మైత్రోస్‌రెడ్డి, శ్రీధర్, విజయ్ పర్యవేక్షించారు.

వినతులు స్వీకరణ

మహబూబ్‌నగర్ టౌన్, జనవరి 11 : జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత అధికారులు పంపిస్తామన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

- ఎమ్మెల్యేలు పర్ణికారెడ్డి, వాకిటి శ్రీహరి

మరికల్, జనవరి 11 : గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని నారాయణపేట, మక్తల్ ఎమ్మెల్యేలు చిట్టెం పర్ణికారెడ్డి, వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సూర్యచంద్ర కన్వెన్షన్ హాల్‌లో 63 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో రెండు అమలు చేశామని, మిగతా వాటిని 50 రోజుల్లో అమలు చేస్తామన్నారు. అనంతరం మరికల్ మండల కేంద్రంలో పామాయిల్ కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. కాగా, పామాయిల్ కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులను ముందు వరుసలో కూర్చోబెట్టి ప్రజాప్రతినిధులను వెనుక వరుసలో కూర్చోబెట్టి అవమానించడం సరికాదని ఎంపీటీసీ గోపాల్ అన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, సర్పంచ్ గోవర్ధన్, తాసీల్దార్ సునీత పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

దామరగిద్ద, జనవరి 11 : మండల కేంద్రంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను గురువారం ఎమ్యెల్యే చిట్టెం పర్ణికారెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సప్ప, సర్పంచ్ ఆశమ్మ, పీఏసీసీఎస్ అధ్యక్షుడు ఈదప్ప, ఎంపీటీసీ బస్వరాజ్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రికెట్ టోర్నీకి జిల్లా విద్యార్థి ఎంపిక

మహబూబ్‌నగర్‌టౌన్, జనవరి 11 : బీహార్ రాజధాని పాట్నాలో ఈ నెల 15 నుంచి 22వ తేదీ వరకు జరగనున్న జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-17 క్రికెట్ టోర్నీలో పాల్గొనే తెలంగాణ బాలుర జట్టుకు జిల్లా కేంద్రంలోని ఫాతిమా విద్యాలయ విద్యార్థి మోసెస్‌రాజ్ ఎంపికయ్యాడు. జాతీయస్థాయి క్రికెట్ టోర్నీకి ఎంపిక కావడంపై హెచ్ఎం థెరిసా, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రవీణ్‌మోసెస్ అభినందించారు. టోర్నీలో ప్రతిభ చాటి జట్టు విజయానికి కృషి చేయాలని వారు ఆకాక్షించారు.

ఆధారాల్లేకుండా మాట్లాడడం సరికాదు

పాలమూరు, జనవరి 11 : కేసీఆర్ పాలనలోనే మహబూబ్‌నగర్ పట్టణం అన్నివిధాలా అభివృద్ధి చెందిందని మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సహకారంతో పట్టణంలో జంక్షన్లు, రోడ్లు, పార్కులు ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కాంగ్రెస్ నాయకులు ఆధారాల్లేకుండా ఇష్టానుసారంగా మాట్లాడితే సహించేది లేదన్నారు. కౌన్సిలర్ కట్టా రవికిషన్ మాట్లాడుతూ మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌పై అవినీతి ఆరోపణలు చేయడం సరికాదన్నారు. పట్టణ అభివృద్ధికి రూ.100కోట్ల నిధులు తీసుకొస్తే కాంగ్రెస్ నాయకులు పనులను నిలిపివేసి కాంట్రక్టర్లను బెదిరింపులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో ముడా చైర్మన్ వెంకన్న, డీసీసీబీ చైర్మన్ వెంకటయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ గణేశ్, కౌన్సిలర్లు అనంతరెడ్డి, శ్రీ నివాసులు, వేద, నరేందర్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రశాంత్, నవకాంత్, సిద్ధిఖీ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

జడ్చర్లటౌన్, జనవరి 11 : మండలంలోని కుర్వగడ్డపల్లి స్టేజీ వద్ద బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కె. నర్సింహులు(59) మృతి చెందినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ఎస్సై కథనం మేరకు మండలంలోని నెక్కొండ గ్రామానికి చెందిన నర్సింహులు జడ్చర్ల నుంచి స్వగ్రామానికి వెళ్లేందుకు కుర్వగడ్డపల్లి స్టేజీ వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, జనవరి 11 : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని కలెక్టర్ రవినాయక్ అన్నారు. గురువారం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ప్రధాన దవాఖానలో దవాఖాన అభివృద్ధి సొసైటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. దవాఖానలో పరిశుభ్రతపై దృష్టి సారించాలని, అవసరమైన మెడికల్ సామగ్రిపై దృష్టి సారించాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇకపై నెలకోసారి సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. తర్వాత నిర్వహించే సమావేశం నాటికి అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదించిన, మంజూరైన, పెండింగ్ పనుల వివరాలు సమర్పించాలన్నారు. సమావేశంలో దవాఖాన అభివృద్ధి సొసైటీ సభ్యులు శామ్యూల్, రామ్మోహన్, మెడికల్ కళాశాల డైరెక్టర్ రమేశ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కృష్ణ, లయన్ నటరాజ్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

కోస్గి, జనవరి 11 : పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నారాయణపేట కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. కోస్గి తాసీల్దార్ కార్యాలయంలో అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. స్కూల్, కాలేజ్, రోడ్లు అభివృద్ధి పనులకు నివేదికలు రూపొందించాలన్నారు. కొత్తగా ఏర్పడిన మండలాల్లో ఒకే చోట పదికరాలు భూమిని గుర్తించాలని తాసీల్దార్లకు సూచించారు. సమావేశంలో కొడంగల్ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, కోస్గి, మాదూర్, గుండుమాల్, కొత్తపల్లి తాసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ఆల కుటుంబానికి పరామర్శ

భూత్పూర్, జనవరి 11 : మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సోదరుడు ఆల శశివర్ధన్‌రెడ్డి గుండెపోటుతో మృతిచెందగా, గురువారం కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నాసాగర్‌కు చేరుకొని పరామర్శించారు. శశివర్ధన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆల వెంకటేశ్వర్‌రెడ్డితోపాటు తల్లి వరలక్ష్మి, శశివర్ధన్‌రెడ్డి భార్య శ్రీలతను పరామర్శించారు.

పకడ్బందీగా చేపట్టాలి

దేవరకద్ర, జనవరి 11 : ప్రజాపాలన దరఖాస్తుల డాటా ఎంట్రీని పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ మోహన్‌రావు సిబ్బందికి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. తాసీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ మండలంలో 12వేల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు.

ఉత్సాహంగా నెట్‌బాల్ టోర్నీ

- ప్రారంభమైన సౌత్‌జోన్ ఫాస్ట్ 5నెట్‌బాల్ చాంపియన్‌షిప్
- పోటీలు ప్రారంభించిన డీవైఎస్‌వో శ్రీనివాస్
- తెలంగాణ పురుషుల జట్టు శుభారంభం..
- టోర్నమెంట్‌లో పాల్గొన్న ఆరు రాష్ట్రాల జట్లు

పోటీలో తలబడుతున్న బాలికల జట్లు

మహబూబ్‌నగర్‌టౌన్, జనవరి 11 : జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇండోర్ క్రీడా మైదానంలో సౌత్ జోన్ ఫాస్ట్ 5, 2వ సీనియర్ మహిళా, పురుషుల నెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు గురువారం ఆట్టహాసంగా ప్రారంభమయ్యాయి. దక్షిణాది నుంచి ఆరు రాష్ట్రాల జట్లు పాల్గొన్నాయి. పోటీలను డీవైఎస్‌వో శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. 320 మంది క్రీడాకారులు, 30 ఆఫిషియల్స్ టోర్నీలో పాల్గొంటున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి జట్ల క్రీడాకారులు తలబడుతున్నారు.

తెలంగాణ జట్టు శుభారంభం..

జిల్లా కేంద్రంలోని ఇండోర్ క్రీడా మైదానంలో జరుగుతున్న సౌత్‌జోన్ ఫాస్ట్ 5 మహిళా, పురుషుల నెట్‌బాల్ చాంపియన్‌షిప్ తెలంగాణ పురుషుల జట్టు శుభారంభం చేసింది. పురుషుల విభాగంలో జరిగిన మ్యాచ్‌లో తెలంగాణ జట్టు 16-05 స్కోర్ తేడాతో ఆంధ్రప్రదేశ్ జట్టుపై గెలిచింది. కేరళ జట్టు 29-12 స్కోర్ తేడాతో పుదుచ్చేరిపై కర్ణాటక జట్టు 38-04 స్కోర్ తేడాతో ఆంధ్రప్రదేశ్‌పై, కేరళ జట్టు 32-07స్కోర్‌తేడాతో తమిళనాడుపై గెలిచాయి. మహిళా విభాగంలో జరిగిన మ్యాచ్‌లో కర్ణాటక జట్టు 39-02స్కోర్‌తో ఆంధ్రప్రదేశ్‌పై, కేరళ జట్టుపై 22-13స్కోర్ తేడాతో పుదుచ్చేరి, కేరళ జట్టు 18-02 స్కోర్‌తేడాతో ఆంధ్రప్రదేశ్ జట్టుపై గెలిచాయి.

క్రీడాకోటలో ఉద్యోగ అవకాశలు

పట్టుదల క్రమశిక్షణతో ఆడితేనే క్రీడల్లో రాణిస్తారని డీవైఎస్‌వో శ్రీనివాస్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని క్రీడా మైదానంలో సౌత్‌జోన్ ఫాస్ట్ 5, మహిళా, పురుషుల నెట్‌బాల్ చాంపియన్‌షిప్ టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సౌత్ జోన్ నెట్